


hindustanmedia333@gmail.com
APTEL / 2004 / 19136
# హిందుస్థాన్ మీడియా
తెలుగు దిన పత్రిక
సామాన్యుడి నేస్తం




ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 16 శుక్రవారం, 1, మే 2026, పేజీలు - 8 వెల :4/-



## డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్..

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్న అనంతరం, ఆయన తన ప్రాధాన్యతలను స్పష్టంగా వివరించారు. తనపై నమ్మకం ఉంచి అత్యున్నత బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఏపీ, తెలంగాణకు మూడు రోజుల పాటు

# వర్ష సూచన



- ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని హెచ్చరిక

హైదరాబాద్

భానుడి భగభగలతో అల్లాడిపోతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లటి కబురు అందించింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఈ ద్రోణి విస్తరించి ఉన్నట్టు వెల్లడించింది.ఈ వాతావరణ మార్పుల వల్ల గురువారం నుంచి శనివారం వరకు రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎంను కలిశారు. తనపై నమ్మకం ఉంచి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు అప్పగించి నందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు, రాష్ట్రంలోని ప్రస్తుత భద్రతా పరిస్థితులపై చర్చించారు.



## పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త

### మంత్రి సీతక్క

హైదరాబాద్, ఏప్రిల్ 30

పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. దత్తత కావాలనుకున్న వారు ఐసీడీసీని సంప్రదించాలని సూచించారు. ఈరోజు (గురువారం) కాచిగూడ బస్ టెర్మినల్‌లో అమ్మఒడి తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని, కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పిల్లల దత్తత కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. సమ్మక్క – సారలమ్మ జాతరలో పిల్లల తల్లులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, జన సమూహ ప్రాంతాల్లో, బస్సు టెర్మినల్, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో తల్లిపాల ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక, శిశు, సంక్షేమ శాఖ అధికారులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# మా వాటా వెంటనే విడుదల చేయండి..

హైదరాబాద్

రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య ఆస్తుల పంపకాల వివాదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా తెలుగు అకాడమీకి సంబంధించిన నిధుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్ర విభజన ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీకి రావాల్సిన వాటా నిధులను తెలంగాణ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్‌డీ విల్సన్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం వాటిని బేఖాతరు చేస్తోందని ఆయన ఆరోపించారు.నిధుల కొరత కారణంగా ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ కార్యకలాపాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని విల్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు, సమగ్ర శిక్షా అధికారులకు లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. మరోవైపు ఏపీ ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాల ముద్రణకు సంబంధించి రావాల్సిన రూ.50 కోట్ల బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు.

- తెలంగాణకు ఏపీ తెలుగు అకాడమీ డిమాండ్
- ఏపీ వాటా నిధులు విడుదల చేయాలని తెలంగాణను డిమాండ్ చేసిన తెలుగు అకాడమీ
- సుప్రీంకోర్టు ఆదేశించినా తెలంగాణ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని ఆరోపణ
- అకాడమీ ఛైర్మన్‌కు కేబినెట్ హోదా ఇవ్వాలని ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి



## కవిత కొత్త పార్టీకి ఈసీ గ్రీన్ సిగ్నల్..

హైదరాబాద్,

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్థాపించిన కొత్త రాజకీయ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. కవిత పార్టీకి 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) అనే పేరును ఖరారు చేస్తూ సీఈసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారులు బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి వెళ్లి అధికారిక లేఖను అందజేశారు.ఈ నెల 25న మేడ్చల్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో కవిత తన కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సభలో పార్టీ పేరును 'తెలంగాణ రాష్ట్ర సేన'గా వెల్లడించారు.

# మైక్రోఫైనాన్స్ కేసులో సంచలనం...

### మంగ్లీ సోదరుడి ఖాతాకు డబ్బులు!

- శివచౌహాన్ ఖాతాలను పరిశీలించగా మూడుసార్లు డబ్బులు వచ్చినట్లు గుర్తింపు
- రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు వచ్చినట్లు గుర్తింపు
- నిందితుల బ్యాంకు ఖాతా వివరాలను కోరుతూ పోలీసుల లేఖ



హైదరాబాద్

గాయని మంగ్లీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రో ఫైనాన్స్ కేసులో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా మంగ్లీ సోదరుడు శివచౌహాన్ బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలించగా, మూడుసార్లు డబ్బులు వచ్చినట్లు గుర్తించారు.రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి శివ అకౌంట్‌కు పెద్ద మొత్తంలో డబ్బులు వచ్చాయని తెలిపారు. దీనితో రమావత్ మధు బ్యాంకు ఖాతాను పోలీసులు జప్తు చేశారు. మధు, హిమకాంత్ రెడ్డి, శివ చౌహాన్‌ల బ్యాంకు ఖాతా వివరాలను అందజేయాలని బ్యాంకులకు పోలీసులు లేఖ రాశారు.మైక్రో ఫైనాన్స్ పేరిట అధిక లాభాలు వస్తాయని నమ్మించి మంగ్లీ, ఆమె సోదరుడు, మరికొంతమంది కలిసి కోట్లాది రూపాయలు మోసం చేశారని సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావు ఆరోపణలు చేశారు.



## కశ్మీర్‌ను పాకిస్థాన్‌లో భాగంగా చూపిస్తూ మ్యాప్..

న్యూఢిల్లీ

మ్యాప్ వివాదంలో చిక్కుకున్న నేపాల్ ఎయిర్‌లైన్స్.. భారత్‌కు క్షమాపణలు చెప్పింది. జమ్మూ, కశ్మీర్‌ను పాకిస్థాన్‌లో భాగంగా చూపుతూ ఉన్న తన నెట్‌వర్క్ మ్యాప్‌ను నేపాల్ ఎయిర్‌లైన్స్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. క్షణాల్లో ఆ మ్యాప్ వైరల్ అయి విమర్శలు వెల్లువెత్తాయి. వెంటనే స్పందించిన నేపాల్ ఎయిర్‌లైన్స్ నష్ట నివారణ చర్యలకు దిగింది. భారత్‌కు క్షమాపణలు చెప్పింది.

# అమరావతిపై వైసీపీ దుష్ప్రచారాన్ని ఎదుర్కోండి

- కేబినెట్ సమావేశంలో మంత్రులకు చంద్రబాబు పలు సూచనలు
- మంత్రుల సింగపూర్ పర్యటనపై వైసీపీ విమర్శలను ఖండించిన చంద్రబాబు



అమరావతి

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులకు ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మంత్రుల సింగపూర్ పర్యటన, అభివృద్ధి పనులపై ప్రతిపక్షం చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు.మంత్రుల సింగపూర్ పర్యటనపై వైసీపీ చేస్తున్న విమర్శలను సీఎం తీవ్రంగా ఖండించారు. సింగపూర్ ప్రభుత్వం మరెవరికీ ఇవ్వని అరుదైన అవకాశాన్ని ఏపీకి ఇచ్చిందని, దీనిని రాజకీయం చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

# కాంగ్రెస్‌లో చేరిన గురవన్నపేట సర్పంచ్ జహంగీర్ గౌడ్

కొమురవెల్లి ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

కొమురవెల్లి మండలం గురవన్నపేట గ్రామ సర్పంచ్ బుడిగె జహంగీర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సమక్షంలో, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 6 గ్యారంటీలతో పాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సర్పంచ్ చేరికతో పార్టీ మరింత బలపడటంతో పాటు గ్రామ అభివృద్ధికి దోహదం అవుతుందని చెప్పారు. సర్పంచ్ జహంగీర్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు తనను ఆకట్టుకున్నాయని, గ్రామ అభివృద్ధి కోసం పార్టీలో చేరినట్లు తెలిపారు. అధికార పార్టీ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, ్రాూజూ మాజీ ఛైర్మన్ మెరుగు కృష్ణ, గురవన్నపేట గ్రామ శాఖ అధ్యక్షుడు బ్రహ్మాండ్లపల్లి చంద్రం, మాజీ ఎంపీటీసీ బుడిగే ఐలేని గౌడ్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు బొచ్చు ఎల్లయ్య, మండల సేవాదళ్ అధ్యక్షుడు బుడిగే అశోక్, మండల పార్టీ సెక్రటరీ బుడిగే బిక్షపతి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏర్పుల రాజు, గొాదల నవీన్, బుడిగే హరీష్, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# మిషన్ భగీరథ నిర్లక్ష్యం... ఐదేళ్ల చిన్నారి ప్రాణాలు బలి

-నేషనల్ హైవే పనుల్లో అధికారుల నిర్లక్ష్యం

బచ్చన్నపేట ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యం ఒక అమాయక చిన్నారి ప్రాణాలను బలితీసుకోవడం స్థానికంగా తీవ్ర ఆవేదనకు దారి తీసింది. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో తవ్విన గుంత ఒక కుటుంబాన్ని శాశ్వత విషాదంలోకి నెట్టింది. గ్రామంలో అమలు చేస్తున్న మిషన్ భగీరథ పనులలో భాగంగా పైప్ లీకేజ్ మరమ్మతుల కోసం సుమారు 20 రోజుల క్రితం నాలుగు మీటర్ల లోతుతో గుంత తవ్వబడింది. అయితే, ఆ గుంతను తిరిగి పూడ్చకపోవడం, చుట్టూ రక్షణ చర్యలు చేపట్టకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా మారింది. ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకుండా, పిల్లలు తిరిగే పాఠశాల ప్రాంగణంలో ప్రమాదకర పరిస్థితి నెలకొన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నిర్లక్ష్యం చివరకు ఐదేళ్ల చిన్నారి మోక్షిత ప్రాణాలను బలితీసుకుంది. పాఠశాల వద్ద ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయిన మోక్షితను గమనించిన ఆమె అక్క దీక్షిత వెంటనే తల్లి కవితకు సమాచారం ఇచ్చింది. అంగన్వాడీ ఆయాగా పనిచేస్తున్న కవిత పరుగెత్తుకుంటూ వెళ్లి గుంతలోకి దిగింది. ఎంతో కష్టపడి కూతురిని బయటికి తీసినప్పటికీ అప్పటికే చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. తల్లి కళ్లముందే కూతురు ప్రాణాలు కోల్పోవడం అక్కడున్న వారిని కన్నీళ్లు పెట్టించింది. ఈ ఘటనతో ఆలీంపూర్ గ్రామం దుఃఖసాగరంలో మునిగిపోయింది. మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ విషాదం జరిగిందని ఆరోపిస్తూ గ్రామస్తులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన పనుల్లో ఇలాంటి నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన మరోసారి రుజువు చేసింది. తాత్కాలికంగా తవ్విన గుంత కూడా ప్రాణాంతకంగా మారుతుందనే విషయం అధికారులకు గుర్తు చేసే దుర్ఘటనగా ఇది నిలిచింది. ఇకపై ఇలాంటి పనులు చేపట్టేటప్పుడు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.



# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల,ఏప్రిల్ 30హిందూస్థాన్ మీడియా

ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెర్ప్ సమావేశానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ భారతిలతో కలిసి హాజరై స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను విస్తరించాలని తెలిపారు. పెట్రోల్ బంకులు, డెయిరీలు, సోలార్ పవర్ ప్లాంట్లు, స్టిచింగ్, ప్లంబింగ్ వంటి రంగాల్లో మహిళలు ముందుకు రావాలని తెలిపారు. మహిళల సామర్థ్యాభివృద్ధి కోసం ప్రభుత్వం100రోజుల శిక్షణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, సహాయక సంఘాల మహిళలు ఇందులో పాల్గొని సర్టిఫికెట్ పొందిన అనంతరం వారి నైపుణ్యాల ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు. మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న రంగాలను గుర్తించి సహాయక సంఘాలు తమ కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన మహిళా శక్తి భవన్‌ను శిక్షణ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని, ప్యాడీ కమిషన్‌లో సుమారు 65శాతం స్వయం సహాయక సంఘాలకు చేరిందని తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిలో ఉందని, జిల్లా సమాఖ్య సభ్యులు ఆర్థికంగా లబ్ధి పొందాలని తెలిపారు. మెషిన్, సెంట్రింగ్, సిమెంట్ ఇటుక యూనిట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యూనిట్ల స్థాపనకు ఇందిరా మహిళా శక్తి పథకం, పిఎంఎఫ్‌ఎం ఈ ద్వారా ఆర్థిక సహాయం, శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య ప్రతినిధులు,స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.





# పది ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన పిల్లుట్ల విద్యార్థులు

-ప్రత్యేక అభినందనలు తెలిపిన గ్రామ సర్పంచ్ బుర్ర మురళిగౌడ్

శివంపేట,ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

శివంపేట మండలంలోని పిల్లుట్ల గ్రామంలో పదవ తరగతి రిజల్ట్ వచ్చిన సందర్భంగా పిల్లుట్ల గ్రామంలోని గులయ్యగారి శ్రీశైలం కూతురు హారికకి 541మార్కులు 9.0 శాతం,మంగళపర్తి శ్రీశైలం కూతురు శ్రీవర్షినికి 541 మార్కులు,9.0 శాతం పర్సంటేజ్ మార్కులు సాధించారు. గతంలో గ్రామ సర్పంచ్ బుర్ర మురళిగౌడ్ చెప్పిన మాట 9.5 మార్కులు వచ్చిన వారికి 5000 రూపాయలు అందిస్తామని చెప్పడం జరిగింది. అయినా వీరిద్దరికీ 9.5మార్కులు రాకపోయినా అత్యధికంగా మంచి మార్కులు సాధించినందుకు వారిని అభినందిస్తూ ఇద్దరి విద్యార్థులకు 2000/-రూపాయల చొప్పున బహుమతి అందజేశారు. ఇకముందు కూడా ఇలాంటి మంచి మార్కులు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పడం జరిగింది.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, పిల్లుట్ల ఆలయ కమిటీ చైర్మన్ పెద్దపులి ఆంజనేయులు, వార్డు సభ్యులు గొల్ల బిక్షపతి, పిల్లి మధు,తలారి హనుమంతు,యువ నాయకులు పెద్దపులి సతీష్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గులయ్యగారి రవీందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెస్త కృష్ణయ్య ,గులయ్యగారి కిష్టయ్య, రామచంద్రం, గ్రామ సెక్రెటరీ నాగేష్ ,బుర్ర వినయ్,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొనడం జరిగింది.





# గృహాల మధ్య ప్రమాదకర బావి

-చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి!



చేర్యాల ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

చేర్యాల మున్సిపల్ లోని 5వ వార్డు పరిధిలో గృహ నిర్మాణాల మధ్య ఉన్న ఓ బావి ప్రస్తుతం తీవ్ర ప్రమాదకర స్థితిలో ఉండటం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా నిర్లక్ష్యంగా వదిలివేయబడిన ఈ బావి చుట్టూ చెత్త పేరుకుపోవడం, పొదలు పెరగడం వల్ల పరిస్థితి మరింత విషమంగా మారింది. ఈ బావి నుంచి విషపూరిత సర్పాలు బయటకు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో సమీపంలో నివసించే కుటుంబాలు భయభ్రాంతులకు గురవుతున్నాయి. ప్రస్తుతం వేసవి సెలవులు కొనసాగుతున్న నేపథ్యంలో చిన్న పిల్లలు బయట ఆటలలో నిమగ్నమవుతుండగా, తెలియక బావి దగ్గరకు వెళ్లే ప్రమాదం ఉంది. బావి చుట్టూ ఎటువంటి గోడలు లేదా రక్షణ కంచె లేకపోవడంతో పిల్లలు అందులో పడిపోయే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులను వెంటనే స్పందించి,ప్రమాదకరంగా ఉన్న ఈ బావిని పూడ్చివేయడంతో పాటు పరిసరాలను శుభ్రం చేసి, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సమయానికి చర్యలు తీసుకోకపోతే ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# జూనియర్ సివిల్ జడ్జ్ తరణికి ఘన వీడ్కోలు




చేర్యాల ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

చేర్యాల కోర్టు ఇంచార్జ్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించిన వేముగంటి తరణి కి చేర్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆరెల్ల వీరమల్లయ్య మాట్లాడుతూ, తరణి గారు చేర్యాల కోర్టులో పనిచేసిన కాలంలో అందించిన సేవలను కొనియాడారు. న్యాయపరమైన విధుల్లో ఆమె చూపిన నిబద్ధత, ప్రజల సమస్యల పరిష్కారంలో చూపిన శ్రద్ధ ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేరుగు రమేష్, ఉపాధ్యక్షులు కాటం సురేందర్, సహాయ కార్యదర్శి పొన్నం సురేష్, కోశాధికారి గూస్క వెంకటేశం, సీనియర్ న్యాయవాదులు బూర్గు యాదగిరి గౌడ్, ఆరెల్ల మహేందర్, తాటికొండ ప్రణీత్, గూడెం శ్రీధర్, నల్లగొండ సంతోష్,భైరగోని ప్రసాద్, రామకృష్ణ,మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# వివిధ కార్యక్రమంలో పాల్గొన్న నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

శివంపేట,ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

హథ్నూర మండలం తుర్కల ఖానాపూర్ గ్రామంలో తుర్కల ఖానాపూర్, సాదుల్ నగర్, ముచర్ల, కోనంపేట్ గ్రామాల గర్భిణీ స్త్రీలకు మాతృదేవోభవ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని లింగాపూర్, వడ్డేపల్లి, రామచంద్రాపూర్, పాంబండతండా గ్రామాలలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో పాల్గొని లబ్ధిదారులకు శు భాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. శివ్వంపేట మండలం పంబడ తండాలో జరిగిన శ్రీసంత్ సేవాలాల్ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పిఎసిఎస్ తాజా మాజీ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, శివంపేట మండల కాంగ్రెస్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



శివంపేట,ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

శివంపేట మండలంలోని లచ్చిరెడ్డిగూడెం వాస్తవ్యులు పెద్దలు కంచుగట్ల లచ్చయ్య ఆకాల మరణం గురించి తెలుసుకొని నిరుపేద కుటుంబం అయిన లచ్చయ్య కుటుంబానికి శివంపేట్ మాజీ జడ్పీటీసీ, ఆపద్బాంధవుడు పబ్బ మహేష్ అన్న తక్షణ సహాయం రూ.5వేలు ఆర్థిక సాయం వారి కుటుంబానికి అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో 2వార్డు మెంబర్ కృష్ణా,మాజీ ఉప సర్పంచ్ రాంరెడ్డి,గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, మహిపాల్ రెడ్డి,రవి, మహేష్, మహిపాల్ తదితరులు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు..

## ఇందిరమ్మ లబ్ధిదారులపై వేధింపులు మానుకోవాలి

**-ఎమ్మార్పీఎస్ డిమాండ్**

మందమర్రి,ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా



మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపీడీవో వేధింపులకు గురి చేయడం తగదని, అలాంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆసంపల్లి శివ డిమాండ్ చేశారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...ప్రభుత్వ గృహ పథకాల అసలు లక్ష్యం పేదలకు గృహ సౌకర్యం కల్పించడమేనని, అమలులో అన్ని వర్గాలకు సమాన న్యాయం జరగాలని అన్నారు.ఇందిరమ్మ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించడం సమంజసమే కానీ,నిర్మాణం ఆలస్యమైతే ఇల్లు రద్దు చేస్తామని బెదిరిస్తూ ఒత్తిడి తేవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి మోడల్ హౌస్ నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు.

## బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు విజయవంతం



బెల్లంపల్లి,ఏప్రిల్30 హిందూస్థాన్ మీడియా

బెల్లంపల్లి,మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన లభించింది. మున్సిపాలిటీకి కేటాయించిన మొత్తం లక్ష్యం30 కాగా,ఆన్లైన్ ద్వారా 156 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 65మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు.అభ్యర్థుల అర్హతలు, అవసరాలు పరిశీలిస్తూ బ్యాంకు మేనేజర్లు మరియు కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సంపత్, చైర్పర్సన్ దావాస్వాతి రమేష్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బెల్లంపల్లి బ్రాంచ్ మేనేజర్ ఎం.రాజుకుమార్, మార్కెట్ బ్రాంచ్ మేనేజర్ డి. కిరణ్,స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు పి. శరిష్,ఎస్. శ్రీకాంత్, హెచ్డిఎఫ్సి బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కె.ధర్మేందర్, ఎస్సీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ టీ.వంశీ కృష్ణ,మెప్మా టీఎంసీ దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి వేళలో మద్యం అమ్మకూడదు

శివంపేట,ఏప్రిల్30 హిందూస్థాన్ మీడియా



శివంపేట మండలంలోని చండి గ్రామంలో మద్యం రాత్రి9గంటల వరకు మాత్రమే అమ్మాలి అని గ్రామ సర్పంచ్ గైనిబైటి ప్రవీణ్ గౌడ్,పంచాయత కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి షాప్ కి నోటీసు ఇవ్వడం జరిగింది.ఎవరైనా 9తర్వాత అమ్మితే గ్రామ పంచాయతీ తరుపున చర్యలు తీసుకోడం జరుగుతుంది అని,వాళ్ళకి సర్పంచ్ ఆధ్వర్యంలో ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో సందిల శ్రీనివాస్ గౌడ్,నర్సింగ్ ఆంజనేయులు, సాలెహ అబ్దుల్ లతీఫ్, బంగారగాని వెన్నెల నాగరాజు, నాయకులు నల్లవల్లి కృష్ణ,ఎంచర్ల రాజశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో అంతర్జాతీయ ఫిష్ పాండ్

**-మత్స్యాభివృద్ధికి కొత్త దారి**
**-ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**

మంచిర్యాల,ఏప్రిల్30 హిందూస్థాన్ మీడియా





దేశంలోనే మొట్టమొదటి ఇంటర్నేషనల్ ఫిష్ పాండ్ మంచిర్యాలలో ఏర్పాటు చేయడం గర్వకారణమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తెలిపారు.ఎమ్మెల్యే నివాసంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన మాట్లాడుతూ... దీని ద్వారా మత్స్యసంపద అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఏర్పడతాయని,చేపల విత్తనాల ఉత్పత్తి ఇక్కడే జరిగి రాష్ట్రంలోని వివిధ చెరువులకు సరఫరా చేయనున్నామని చెప్పారు.ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. దండేపల్లి మండలం గూడెం గ్రామంలోని సత్యనారాయణస్వామి ఆలయాన్ని సుమారు రూ.70కోట్లతో రెండో అన్నవరం తరహాలో అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే పుష్కరాల దృష్ట్యా మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయాన్ని రూ.10కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా అయినా ప్రారంభించామని,ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు తగిన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని చెప్పారు.ఈ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రివర్గానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల,ఆర్టీసీ బస్సు డిపోలలో ఉద్యోగుల పదవీ విరమణలు





రాజేంద్రనగర్,ఏప్రిల్ 30హిందూస్థాన్ మీడియా

రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఆరుగురు సిబ్బందిని గురువారం సాయంత్రం డిపో మేనేజరు బి.క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ప్రతి ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ అనేది సహజమేనన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారి జీవితాలలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ,ఐష్టశ్వర్యాలను ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామని తెలిపారు.ఉద్యోగ విరమణ పొందిన పుస్తకాల శ్రీశైలం, వడ్డె చంద్రయ్య (కండక్టర్లు), కె.క్రిష్ణారెడ్డి(మెకానిక్), జి.సురేందర్, సయ్యద్ గౌస్, ఎండీ షర్ఫుద్దీన్ (డ్రైవర్లు)విధి నిర్వాహణలో ఎంతో కష్టపడి నమ్మకంగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మెకానికల్ ఫోర్మెన్ నీలిమ,ఉద్యోగ సంఘం నాయకులు ఎంహెచ్ అలీ,అంజయ్య, ఏపీరెడ్డి,లతో పాటు పుస్తకాల శ్రీశైలం స్నేహితులు అక్కిరాజు సుబ్బారావు, కృష్ణారావు, క్రిష్ణారెడ్డి, సీకె రమేశ్,ఎం. విజయ్ కుమార్, పి. శ్రీనివాస్ గౌడ్,సి.అశోక్,పి. రవీందర్, ఉమేశ్, జి.నర్సింహ్మా, ఎ.భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

**-వ్యవసాయ విశ్వవిద్యాలయంలో...**

వ్యవసాయ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ యూనివర్శిటీ హెడ్ అండ్ ప్రొఫెసర్ అజీజుద్దీన్ మహమూద్తో పాటు రికార్డు అసిస్టెంట్ గా పనిచేస్తున్న జె.క్రిష్టఫర్ రాజులను వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఉద్యోగ విరమణ పొందిన అజీజుద్దీన్ మహమూద్,జె.క్రిష్టఫర్ రాజుల సేవలను కొనియాడారు.విధి నిర్వాహణలో బాధ్యతాయుతంగా, నిస్వార్థంగా సేవలందించారన్నారు.వారి శేష జీవితం సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో విలసిల్లాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఉద్యోగులు, రాజేంద్రనగర్ పాస్టర్స్ పెలోషిప్ పాలకమండలి సభ్యులు ప్రణీత్ బాబు,గుంటి డానియేల్,యేసన్న, మోజెస్ లు పాల్గొన్నారు.

# ఏరియాలో 100శాతం బొగ్గు ఉత్పత్తి

**-భద్రతతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించడమే ప్రధాన లక్ష్యం..**
**-జీఎం ఎన్.రాధాకృష్ణ**

మందమర్రి,ఏప్రిల్30హిందూస్థాన్ మీడియా



ఏరియాలో సింగరేణి గనుల్లో ఏప్రిల్ నెలకు గాను నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను 100శాతం సాధించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ తెలిపారు.గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఏప్రిల్ నెల ఉత్పత్తి, రవాణా,సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భూగర్భ, ఉపరితల గనుల్లో సమన్వయంతో పని చేయడం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని పేర్కొన్నారు. శాంతిఖని, కేకే-5, కాసిపేట, కాసిపేట-2గనులు, అలాగే కేకేఓసి ఓపెన్కాస్ట్ గనిలో లక్ష్యాన్ని అధిగమిస్తూ ఉత్పత్తి సాధించడం విశేషమని అన్నారు. కేకేఓసి శాంతిఖనిలో 10వేల టన్నులకు గాను1118 టన్నులు, కేకే 5 గనిలో 16వేల టన్నులకు గాను 16280 టన్నులు,కాసిపేట గనిలో 19వేల టన్నులకు గాను 10వేల 293టన్నులు,కాసిపేట 2గనిలో 16 వేల 500 టన్నులకు గాను 10395టన్నులు,కేకే ఓసిపిలో 1.4 లక్షలకు గాను1.63 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు.అదేవిధంగా ఏప్రిల్ నెలలో మొత్తం 52 రేకుల బొగ్గు రవాణా జరిగిందని పేర్కొన్నారు.ఓవర్ బర్డెన్ (ఓబి)తొలగింపులో 116 శాతం సాధించి రికార్డు సృష్టించినట్లు తెలిపారు. భూగర్భ గనుల్లో కార్మికుల గైర్హాజరు సమస్య ఉత్పత్తిపై ప్రభావం చూపుతోందని, ఈ సమస్య పరిష్కారానికి యూనియన్ నాయకులతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని జీఎం తెలిపారు. ఉద్యోగులు, అధికారులు,యూనియన్ ప్రతినిధుల సహకారంతోనే 100 శాతం ఉత్పత్తి సాధ్యమైందని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రతి నెల లక్ష్యాలను అధిగమించాలని పిలుపునిచ్చారు.సింగరేణి సీఎండీ సూచించిన ఐదు ముఖ్య అంశాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, వ్యయ నియంత్రణ,మానవ వనరుల పూర్తి వినియోగం,యంత్రాల పనితీరు మెరుగుదల, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకోవాలని చెప్పారు. రామకృష్ణపూర్ ఓపెన్కాస్ట్ ప్రాజెక్టును ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాసిపేట-1 గనిలో ప్రారంభించిన మ్యాన్ రైడింగ్ సిస్టమ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్పత్తిని మరింత పెంచాలని సూచించారు.భద్రతతో కూడిన నాణ్యమైన ఉత్పత్తి సాధించడమే ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు.ఇక విద్యా రంగంలోనూ సింగరేణి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని జీఎం తెలిపారు. అలాగే పట్టణంలోని సింగరేణి హైస్కూల్ నుంచి 555 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 7మంది 500 పైగా మార్కులు సాధించారని,లోకేష్ అనే విద్యార్థి గణితంలో 100/100 మార్కులు సాధించడం అభినందనీయమని కొనియాడారు. ఎండల తీవ్రత దృష్ట్యా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కార్మిక సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేకేఓసి గనిలో పని చేసే కార్మికులకు,ఆఫ్లోడింగ్ సిబ్బందికి ఏప్రిల్ 1 నుంచి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ విజయానికి సహకరించిన ప్రతి అధికారికి, కార్మికుడికి జీఎం ఎన్. రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో యాక్టింగ్ ఎస్.ఓ.టు జీఎం అబ్దుల్ ఖాదీర్,ఏరియా ఇంజనీర్ బాలాజీ, డీజీఎంపర్సనల్ అశోక్,డీజీఎం ఐఈడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంగేజ్మెంట్ ఫంక్షన్ కి హాజరైన కంది శ్రవణ్ రెడ్డి

ఉప్పల్,ఏప్రిల్ 30హిందూస్థాన్ మీడియా



హబ్సీగూడ డివిజన్ యువజన కాంగ్రెస్ నాయకులు వినోద్ నాయక్ సోదరీమని ప్రియాంక-దినేష్,ల ఎంగేజ్మెంట్ ఫంక్షన్ కి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రియాంక-దినేష్, లను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ జనరల్ సెక్రటరీ ధర్మా నాయక్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసునాయక్, సెక్రటరీ సుమన్ నాయక్, శివ, షబ్బీర్, గణేష్, రమేష్ నాయక్, శంకర్ నాయక్, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

# కొత్త మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలి





-సమస్యల పరిష్కారానికి చొరవతో పని చేయాలి..
-మహిళా సంఘాలు బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలి..
-ఆర్థిక బలోపేతంపై దృష్టి పెట్టాలి..
-రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్,ఏప్రిల్30హిందూస్థాన్ మీడియా

రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవతో పని చేయాలని జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం అర్బన్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ టీమ్‌తో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జోన్‌లో జరుగుతున్న యూసీడీ కార్యకలాపాల పై సమగ్రంగా చర్చించారు. ప్రత్యేకంగా, స్వయం సహాయక సంఘాలు ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచించారు.కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలో సభ్యత్వం లేని అర్హులైన మహిళలను గుర్తించి కొత్త ఎస్‌హెచ్.జి గ్రూపులను ఏర్పాటు చేయాలని తెలిపారు. మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేరడానికి ప్రోత్సహించాలని, ఇప్పటికీ సభ్యులుగా లేని మహిళలను గుర్తించాలని తెలిపారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధించడంలో మహిళల భాగస్వామ్యం కీలకమని, స్వయం సహాయక సంఘాల ఏర్పాటు తో మహిళా ఆర్థిక స్వాలంబనకు, మహిళల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు."99డేస్ ఆఫ్ యాక్షన్ ప్లాన్"కార్యక్రమం కింద ఇప్పటివరకు జోన్‌లో మొత్తం195 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు ఏర్పాటు చేయబడినట్లు సమావేశంలో తెలియజేశా రు.ఈ సంఖ్యను మరింత పెంచడానికి వార్డ్ స్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.అలాగే మహిళల ఆర్థిక సాధికారతకు మహిళా గ్రూపులు కీలకంగా మారాలని,ప్రతి అర్హ కుటుంబాన్ని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని కమిషనర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో పిఓ డాక్టర్ స్వాతి,సంబంధిత అధికారులు,యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.5,60లక్షల ప్రైవేట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ






ఉప్పల్,ఏప్రిల్30హిందూస్థాన్ మీడియా

ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మొత్తం రూ.5,60లక్షల విలువైన ప్రైవేట్ స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు.బుధవారం గురువారం రెండు రోజులలో మలబార్ జ్యువెలరీ సంస్థ ఆధ్వర్యంలో రూ.2,60 లక్షల ఇండస్ట్రియల్ అండ్ ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా అందుకున్నారు.అలాగే గుంటూరుకు చెందిన సమర్థన్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా రూ.3లక్షల ఆర్థిక సహాయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయకుమార్ చేతుల మీదుగా అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు.ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రైవేట్ స్కాలర్‌షిప్‌ల కన్వీనర్ డాక్టర్ జి.తిరుపతయ్య ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయకుమార్ మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తు కోసం తోడ్పాటు అందిస్తున్న సమర్థన్ స్వచ్ఛంద సేవా సంస్థకు, అలాగే తమ సీఎస్ఆర్ నిధుల ద్వారా స్కాలర్‌షిప్‌లు అందించిన మలబార్ జ్యువెలరీ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ, మొదటి మరియు రెండవ సెమిస్టర్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మెరిటోరియస్ విద్యార్థులకు ఈఉపకార వేతనాలు అందజేయడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.ఈ స్కాలర్‌షిప్‌ల సాధనకు అహర్నిశలు కృషి చేసిన డాక్టర్ తిరుపతయ్యను,అలాగే కార్యక్రమం విజయవంతానికి సహకరించిన కళాశాల ఎల్‌డీసీ సూర్య దీప్తరెడ్డిని ప్రిన్సిపాల్ అభినందించారు.ప్రతి సంవత్సరం వివిధ స్వచ్ఛంద సంస్థలు కళాశాల విద్యార్థులకు ప్రైవేట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నాయని, గత సంవత్సరం రూ.3లక్షలు, ఈ సంవత్సరం రూ.5.60లక్షలు అందాయని తెలిపారు.అదేవిధంగా విప్రో స్కాలర్‌షిప్‌లు కూడా త్వరలో విద్యార్థుల ఖాతాల్లో జమ కానున్నాయని డాక్టర్ తిరుపతయ్య తెలియజేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతూ,అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధిస్తే భవిష్యత్తులో మరిన్ని స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశాలు ఉంటాయని సూచించారు.ప్రైవేట్ కళాశాల ఫీజులు చెల్లించి చదవాల్సి వస్తే,ప్రభుత్వ కళాశాలలో మాత్రం ఉచిత విద్యతో పాటు స్కాలర్‌షిప్‌ల రూపంలో ఆర్థిక సహాయం కూడా లభిస్తుందని వివరించారు. అంతేకాకుండా ప్రభుత్వ కళాశాలలో పీహెచ్‌డీ,నెట్ అర్హతలు కలిగిన అధ్యాపకులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తమ చుట్టుపక్కల ఉన్న ఇతర విద్యార్థులను కూడా ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలు పొందేలా ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జల్ద విశ్వనాథ కుమార్,డాక్టర్ యమున,విజయ్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

# నేడే "మేడే" ప్రపంచ కార్మిక దినోత్సవం

కామారెడ్డి ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

ప్రపంచ కార్మిక దినోత్సవం.. పోరాడితే పోయేదేమీ లేదంటూ..! బానిసత్వం, వెట్టిచారికికి వ్యతిరేకంగా, శ్రమదోపిడీని ఎదురిస్తూ కార్మిక లోకం కీలక హక్కులు సాధించుకున్న దినం మే డే. శ్రమకు తగిన గుర్తింపు, సరైన వేతనం, రోజుకు 8 గంటల పని హక్కును కార్మికులు పోరాడి సాధించుకున్న " మే 1" ని ఇండియా సహా వందలాది దేశాలు ప్రపంచ కార్మిక దినోత్సవంగా జరుపుకొంటాయి.

**-మే 1అంటే 'మేడే'....!**

దీన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అని కూడా పిలుస్తారు. అమెరికాలో మాత్రం ప్రస్తుతం దీన్ని 'లాయల్టీ డే'గా వ్యవహరిస్తున్నారు. ఇండియా సహా చాలా దేశాల్లో మే డేని సెలవు దినంగా పాటిస్తారు.కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేకున్నా 1886లో అమెరికాలోని షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మేడే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు.

**-కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం....!**

నినదిస్తూ 1886, మే1న చాలామంది కార్మికులు పోరాటం చేపట్టారు. దానికి మద్దతుగా నాలుగు రోజుల తరవాత షికాగోలోని హే మార్కెట్‌లో చాలామంది ప్రదర్శన నిర్వహించారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు.మానవుడు చక్రం కనిపెట్టడం నాగరికత మార్పునకు, కాల క్రమంలో పారిశ్రామికీకరణకు దారితీయగా, కార్ల్ మార్క్స్ శ్రమదోపిడీని నిర్వచించిన తర్వాత కార్మిక పోరాటాలు, హక్కుల స్పృహక్రమంగా పెరుగుతూ వచ్చాయి. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి.. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప..' అని ఎలుగెత్తి చాటాడు కార్ల్ మార్క్స్..!

**-కార్ల్ మార్క్స్ నినాదం...!**


పోరు నినాదమై ప్రపంచ కార్మికులను ఆకర్షించింది. ఇదే స్ఫూర్తితో 1886లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు శ్రమశక్తికి తగిన గుర్తింపు, పనికి తగిన వేతనం, పనిగంటల తగ్గింపు డిమాండ్‌తో పారిశ్రామికవేత్తలపై తిరగబడ్డారు.రోజుకు 18 గంటలు,16 గంటలు పని చేయలేమని, బానిసత్వంతో బతకలేమని నినదించారు. ఈ పోరాటంలో నాటి పెట్టుబడిదారి (యజమాని) వర్గం కొందరు వందలాది మంది కార్మికులను పొట్టనపెట్టుకున్నది. ఈ పోరాటం తర్వాతే ప్రపంచ కార్మికులు రోజుకు 8 గంటల హక్కును సాధించుకున్నారు.

**-1889 నుంచి 1890 వరకు...!**

అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. నాటి అమరుల త్యాగానికి ప్రతీక 'మే డే'. ఏటా మే 1వ తేదీన ""ప్రపంచ కార్మికుల దినోత్సవం" జరుపుకుంటున్నాం. కాలక్రమంలో ప్రపంచవ్యాప్తంగా మే డే స్వరూపం మారుతూ వచ్చింది. అనేక దేశాల్లో ఆ రోజున పోరాటాలూ, నిరసన ప్రదర్శనలూ చేపట్టడం పరిపాటైంది.

**-1900 నుంచి 1920 వరకూ..!**

యూరప్‌లో ప్రభుత్వ, ధనిక వ్యాపారుల దోపిడీని ఎండగడుతూ సోషలిస్టు పార్టీల ఆధ్వర్యంలో మే1న నిరసన ప్రదర్శనలు జరిగేవి. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో మే డే నాడు యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చేపట్టేవారు. తరవాతి దశకాల్లో మే 1ని నాజీల వ్యతిరేక దినోత్సవంగా జరిపేవారు.రెండో ప్రపంచ యుద్ధం తరవాత యూరోపియన్ దేశాల్లో మే1ని సెలవు దినంగా పాటించడం మొదలుపెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి.



చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి రావడం మొదలయ్యాయి.

**-అటు సంక్షేమ పథకాల అమలుతో పాటు నిరసన...!**

కార్యక్రమాలకూ మే 1 వేదికగా మారింది. వేర్వేరు దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థపై నిరసన ప్రదర్శనలు కూడా ఆ రోజునే మొదలయ్యాయి. అనేక ఇతర కార్మిక ఉద్యమాలూ మే డే నాడే ప్రాణం పోసుకున్నాయి.భారత్‌లోని కొన్ని రాష్ట్రాల్లో మే డేని సెలవు దినంగా పాటిస్తారు. ట్రేడ్ యూనియన్లు ఇదే రోజున ధర్నాలతో పాటు ర్యాలీలు, ఇతర ప్రదర్శనలనూ చేపడతాయి. కార్మికుల పని వాతావరణంతో పాటు వేతనాలూ మెరుగవ్వాలన్నది చాలాకాలంగా లేబర్ యూనియన్ల ప్రధాన డిమాండ్‌గా మారింది. అందుకే కారల్ మార్క్ ప్రపంచ కార్మికులారా ఏకంకండి బానిస సంకెళ్ల విముక్తికై శ్రమించి ఏ కతాటిపై తరిమికొట్టే ఆయుధం ఒక కార్మిక శక్తి మాత్రమే ఉందని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత కారల్ మార్క్ కు దక్కింది.

## పది ఫలితాల్లో సత్తాచాటిన అత్తాపూర్ విద్యార్థులు



రాజేంద్రనగర్,ఏప్రిల్30హిందూస్థాన్ మీడియా

పదవతరగతి ఫలితాలలో రాజేంద్రనగర్ మండలంలోని అత్తాపూర్ పాఠశాల విద్యార్థులు తెలుగు మీడియంలో అత్యుత్తమ మార్కులు సాధించారు. 2025-26విద్యా సంవత్సరంలో తెలుగు మీడియం విద్యార్థి మహేష్ 548సాధించి మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచాడు.అలాగే రూపశ్రీ 508మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు,వీరిద్దరిని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత, విద్యార్థులను ఘనంగా సన్మానించారు,ఈ కార్యక్రమంలో పిఆర్టీయు రాజేంద్రనగర్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస సాగర్,పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు రజియా బేగం, పాఠశాల గణిత ఉపాధ్యాయురాలు జ్యోతి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి ఫలితాలు సాధించారని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలి అని కోరారు.

## కవితక్క పార్టీ పేరు తెలంగాణా రాష్ట్ర రక్షణ సేన

-కావూరి వెంకటేష్

నాంపల్లి,హైదరాబాద్,ఏప్రిల్30హిందూస్థాన్ మీడియా



తెలంగాణా రాష్ట్ర రాజకీయాల్లో తన తనదైన శైలిలో మార్పు తీసుకురావాలని కోరుకొంటూ పార్టీని ఏర్పాటు చేసిన కవిత టీఆర్ఎస్ అనే పేరు వచ్చేలా తెలంగాణా రాష్ట్ర సేను పార్టీని నాలుగు రోజుల క్రితం మేడ్చల్ లో భారీ ఆవిర్బావ సభను ఏర్పాటు చేసి తెలంగాణా రాష్ట్ర సేనగా పార్టీ పేరును ప్రకటించిందని ఆపార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జి కావురి వెంకటేష్ తెలిపారు.ఈ సందర్బంగా వెంకటేష్ మాట్లాడుతూ...పార్టీ పేరుపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో రాష్ట్ర సేన స్థానంలో రక్షణ సేన అంటూ పార్టీ పేరు మారుస్తూ ఎన్నికల సంఘంతో కవిత పార్టీ సంప్రదింపులు జరిపిందన్నారు.దీనికి ఎన్నికల సంఘం కూడా ఆమోదం తెలపడంతో తెలంగాణా రక్షణ సేన పేరుతో తెలంగాణాలో కవిత తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టేందుకు లైన్ క్లియర్ అయిందన్నారు.ఎన్నికల సంఘం అధికారులు పార్టీ కార్యాలయానికి వెళ్లి ఇందుకు సంబంధించిన పత్రాలను అందచేసినట్లు కవిత కార్యాలయంల వెల్లడించిందని కావూరి వెంకటేష్ తెలిపారు.

## ఆలయ ఆవరణలో ఊరపందుల స్వైర విహారం




నిజాంపేట,ఏప్రిల్30హిందూస్థాన్ మీడియా

మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో పందుల బెడద తీవ్రమైంది.పరిసరాల్లోని పంట పొలాలపై పడుతూ పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు,గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతంలో పందుల సమస్య లేదని, ఇప్పటికైనా పాలకవర్గం స్పందించి తమను ఈ సమస్య నుండి విముక్తి కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## తిప్పనగుల్లలో పౌరహక్కుల దినోత్సవం

నిజాంపేట,ఏప్రిల్30



మండల పరిధిలోని తిప్పనగుల్ల గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్,ఎస్ఐ రాజేష్,గ్రామ సర్పంచ్ మంగలిపల్లి మంజుల రమేష్, ల ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రెండు గ్లాసుల పద్ధతి వినడాలన్నారు.కులం పేరుతో దూషించినట్లయితే ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే మద్యపానం, గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వర్ణలత రాములు,కార్యదర్శి జితేందర్, బాబునాయక్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ వేణుగోపాల స్వామి జాతర

ఏప్రిల్ 30 హిందుస్థాన్ మీడియా



ఆత్మకూరు మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామివారి జాతర ఘనంగా నిర్వహించబడనుంది. గత ఆరు రోజులుగా కొనసాగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ఈ జాతర ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సందర్భంగా భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉంది. సంప్రదాయబద్ధంగా బండ్లు తిరుగుట వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయి. స్వామివారి కృపాకటాక్షాలు పొందేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి కోరారు.

## ఏరియా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



ఏప్రిల్ 30 హిందుస్థాన్ మీడియా

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో వి కే సి ఎం ప్రాజెక్టు ప్రభావిత పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా గౌతంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు గ్రామ ప్రజలకు రక్తపోటు ( బిపి), మధుమేహం ( షుగర్) వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. సింగరేణి సంస్థ ప్రజల ఆరోగ్య సంక్షేమానికి కట్టుబడి ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ లలిత కుమారి మాట్లాడుతూ, గ్రామ ప్రజలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపించి, ఇలాంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. వికే సీఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహ రావు మాట్లాడుతూ, ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ లలిత కుమారి వికే సీఎం ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహ రావు గౌతంపూర్ గ్రామ సర్పంచ్ సపవాట్ కళ్యాణి, గ్రామ కార్యదర్శి శర్మిల వెల్ఫేర్ ఆఫీసర్ విక్టర్ ఏఐటీయూసీ నాయకులు ఎం.ఆర్.కే ప్రసాద్ ఐ ఎన్ టి యు సి నాయకులు గోపు కుమార్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజల్లో న్యాయ అవగాహన పెంపుకు న్యాయ విజ్ఞాన సదస్సు

-ప్రజల్లో చైతన్యం అవసరం
-ఆడెపు వేణు, లోక్ అదాలత్ సభ్యులు



ఏప్రిల్ 30 హిందుస్థాన్ మీడియా

ప్రజలకు న్యాయంపై అవగాహన పెంపొందించి, అందరికీ సులభంగా న్యాయం అందించాలనే లక్ష్యంతో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది శ్రీ. ఆడెపు వేణు అన్నారు. గురువారం వీర్నపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి పి.నీరజ ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, DLSA పి.లక్ష్మణాచారి సమన్వయంతో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ అవగాహన ప్రతి పౌరుడికి అత్యవసరమని, చట్టాల గురించి తెలిసి ఉంటేనే వ్యక్తి తన హక్కులను రక్షించుకోగలడని తెలిపారు. సమాజంలో బలహీన వర్గాలు, మహిళలు, పిల్లలు, వృద్ధులు తమ హక్కులను వినియోగించుకునేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు గుర్రం ఆంజనేయులు, న్యాయవాదులు తవుటు మధుసూదన్, గ్రామ సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న, ఉప సర్పంచ్ జక్కు నరేష్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు





-రైతుల పక్షపాతి రేవంత్ రెడ్డి సర్కార్.
-ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

ఏప్రిల్ 30 హిందుస్థాన్ మీడియా

ఎలిగేడు మండలంలోని ధుర్షనిమియాపేట, సుల్తాన్పూర్, ముప్పిరితోట, ర్యాకలదేవుపల్లి గ్రామాల్లో గురువారం రోజున సింగిల్ విండో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వద్ద కొనుగోలు కేంద్రాలను రైతులతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లపాటు రైతులు కొనుగోలు కేంద్రాలలో అష్ట కష్టాలు పడ్డారని, ఇప్పుడు అన్నదాతకు ఏ చిన్న ఇబ్బంది రాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నామని ఈ ప్రభుత్వంలో రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఒక్క సారి ఆలోచన చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని, పెద్దపల్లి నియోజకవర్గంలో తాను సైతం రైతులకు ధాన్యానికి గింజ కటింగ్ లేకుండా చేస్తూ రైతుల కోసమే నిరంతరం పాటు పడుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, వార్డు సభ్యులు మరియు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భిక్కనూర్ వాసి రాష్ట్రస్థాయి 6వ ర్యాంకు షర్మిష్ట ఘనత

-అక్షర వారసత్వం- అద్భుత ఫలితం తాటిపాముల షర్మిష్ట
-రిటైర్డ్ మండల విద్యాధికారి తాటిపాముల నాగభూషణం గౌడ్ మనమరాలు

ఏప్రిల్ 30 హిందుస్థాన్ మీడియా

ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన తాటిపాముల షర్మిష్ట అద్భుత ప్రతిభ కనబరిచి గ్రామ కీర్తిని దిశదిశలా చాటింది,వారి కుటుంబానికి విద్యారంగంలో విడదీయలేని అనుబంధం ఉంది, షర్మిష్ఠ తాతయ్య ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఎన్.సి.సి ట్రైనింగ్, మండల విద్యాధికారి తాటిపాముల నాగభూషణం గౌడ్ దాదాపు 35 సంవత్సరాల పాటు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా నిరంతర సేవలు అందించి,రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయునిగా,జిల్లా ఉత్తమ మండల విద్యాధికారిగా పురస్కారాన్ని అందుకున్న ఘనత వారి తాతయ్యకు సాధ్యమైంది,తాతయ్య నిర్దేశం వారి కుటుంబానికి కాకుండా భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థికి ఒక గురువుగా దిశ నిర్దేశం చూపిన దేవునిగా వారి సేవలు మండల కేంద్రంలోని ప్రతి విద్యార్థికి మార్గ నిర్దేశం అందించడంలో వారి పాత్ర కీలకం, వారి వద్ద విద్యను అభ్యసించిన వారు ప్రజాప్రస్థానంలో శాసనసభ్యునిగా,ఐపీఎస్ క్యాడర్ లో ఉన్నత స్థాయిలో ఉద్యోగ వృత్తిలో కొనసాగుతున్నారు, ఈవిధంగా వారి విద్యార్థులు ఒక ఉపాధ్యాయునిగా, మండల విద్యుత్ ఏఈగా, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గా వివిధ ప్రభుత్వ శాఖలలో కొనసాగుతున్నారు, ఈవిధంగా వారి కుటుంబంలో వారి మనవరాలుకు తాతయ్య మార్గ నిర్దేశంతో పాటు, వారితండ్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వ్యాపారవేత్త, తాటిపాముల విజయ్ కుమార్ గౌడ్-సౌజన్య దంపతుల కుమార్తె షర్మిష్ట, హైదరాబాద్ లోని నారాయణ ఒలంపియాడ్ హైస్కూల్ లో 592/600 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించి తనసత్తా చాటింది, ఈసందర్భంగా షర్మిష్ట తన ఆనందాన్ని పంచుకుంటూ.. ఈ విజయ వెనుక తన తండ్రి విజయకుమార్ గౌడ్ ప్రోత్సాహంతో తండ్రి వ్యాపార రంగంలో స్థిరపడినప్పటికీ తన చదువు విషయంలో ఎక్కడ రాజీ పడకుండా నిరంతరం కృషి చేస్తూ,అదే విధంగా తన తల్లి సౌజన్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కావడంతో ఇంట్లోనే విద్యా విధానం లభించిందని ఆమె మార్గదర్శకత్వం తనకు ఎంతో తోడ్పడిందని వివరించింది, అదేవిధంగా నర్సరీ నుండి పదవ తరగతి వరకు తనకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రతి గురువుకు ఆమె పేరుపేరునా ధన్యవాదాలు తెలిపింది, ఈసందర్భంగా షర్మిష్ట విజయం పట్ల తల్లిదండ్రులు తాతయ్య నానమ్మ సంతోషాన్ని వ్యక్తం చేశారు,వారి విజయం పట్ల మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు ఆనందని వ్యక్తపరిచారు, అదే విధంగా భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని మండల ప్రజలు ఆకాంక్షించారు.



## వివాహ వేడుకకు హాజరై అల్లం వారి కానుకను అందజేసిన





-కాంగ్రెస్ పార్టీ నాయకులు
-అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి ఆశీస్సులు,రెండు వివాహ వేడుకల్లో నూతన దంపతులకు ఆశీర్వాదం

ఏప్రిల్ 30 హిందుస్థాన్ మీడియా

సామాజిక సేవలో ముందుండే ప్రముఖ నాయకులు అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి తరపున రెండు వివాహ వేడుకల్లో నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. మనుగొండ వాస్తవ్యులు చాపర్తి యాకలక్ష్మి -- నర్సింహరాములు దంపతుల కుమార్తె వర్షిణి (మమతా) కోటేశ్ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మదాసి రాంబాబు పాల్గొని నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. అల్లం బాల కిషోర్ రెడ్డి తరపున బహుమతిని తుప్పరి వికాస్, గాడిదల బొంద్యాలు చేతుల మీదుగా వధూవరులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయ అశోక్ ఇతరులు పాల్గొన్నారు. అనంతరం, దశ్రు తండా వాస్తవ్యులు కేలోతు లక్ష్మి,కీ.శే. హరిలాల్ దంపతుల కుమారులు కేలోతు శరత్ శివరాణి వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మదాసి రాంబాబు, దశ్రు తండా సర్పంచ్ కేలోతు అమృత బిక్షపతి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అల్లం బాల కిషోర్ రెడ్డి తరపున బహుమతిని తుప్పరి వికాస్, సర్పంచ్ కేలోతు అమృత బిక్షపతి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గాడిదూల బొంద్యాలు, బోయ అశోక్, హార్య తండా హరి నాయక్, మాజీ సర్పంచ్ కేలోతు సరోజన స్వామి, జరుప్ల తిరుపతి, జరుప్ల నరసింహ, కేలోతు రాజు, కేలోతు రవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు ఆనందంగా, ఐశ్వర్యంగా, దీర్ఘకాలం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అల్లం బాల కిషోర్ రెడ్డి యువ సైన్యం.

## శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో విష్ణు పారాయణము

ఏప్రిల్ 30 హిందుస్థాన్ మీడియా

గూడూరు గ్రామం మండలంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి వారి మంగళషాషణములతో వార్షిక బ్రహోత్స వాళ్ళో భాగంగా వికాస తరంగిణి నర్సంపేట శాఖ వారి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ అష్టోత్తరపూజలు, విష్ణు సహస్ర నామపారాయణము ఘనంగా నిర్వహించడం జరిగింది, ఇట్టి కార్యక్రమం లో గూడూరు గ్రామం మహిళలు, అంజన్న మాలాధార భక్తులు నర్సంపేట విటి శాఖ బాధ్యులు మహిళలు పాల్గొన్నారు, నారాసింహ స్వామి జయశీతోత్స వాళ్ళో భాగంగా ఆధ్యాత్మిక కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆ సంస్థ కార్యదర్శి రంగనాధ స్వామి తెలిపారు, కార్యక్రమం లో కన్వీనర్ డాక్టర్ చామర్తి నందాకిశోర్, కోశాధికారి మెరుగోజు. రేణుక, కార్యకర్తలు చల్ల.వెంకట్ రెడ్డి శోభరాణి, రాధిక, చిలువేరు సాయి శ్రీనివాస్, పంచమర్తి సరిత, సంకినేన



జ్యోతి కార్యవర్గ సభ్యులు పాల్గొని తీర్ధ వినియోగం తో కార్యక్రమం సుసశీపన్నం ఐనది..

# తెలంగాణ ఉద్యమకారులకు ఊరట ఇచ్చిన న్యాయస్థానం

**-16 సంవత్సరాల సుదీర్ఘ విచారణకు నేటి తో తెరపడింది..........**

ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

వరంగల్ లీగల్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం, నాటి ఉద్యమ అవసరాల కోసం చేపట్టిన రైలు-రొఖోలో పాల్గొన్నారంటూ రైల్వే పోలీసులు నమోదు చేసిన కేసులో 13 మంది ఉద్యమకారులపై మోపిన అభియోగాలను కొట్టివేస్తూ హనుమకొండ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గండు రామలింగం గురువారం తీర్పు ఇచ్చారు. కేసు పూర్వపరాల్లోకి వెళితే 28 మే 2010 రోజు రాత్రి సమయంలో నెక్కొండ-ఇంటికన్నె మార్గంలోని రైల్వే లైన్ పై పెద్ద పెద్ద చెట్లను కొట్టివేయడమే కాక రైలు పట్టాలకు సంబంధించిన క్లిప్పులను తీసివేసి రైలు నడువకుండా చేశారన్న అభియోగంతో నెక్కొండ మండలం అలంకాని పేట గ్రామానికి చెందిన 12 మంది ఉద్యమ కారులతోపాటు అప్పటి నర్సంపేట పొలిటికల్ జేఏసీ చైర్మన్ సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్ పై వరంగల్ రైల్వే పోలీస్ విభాగం రైల్వే యాక్ట్ లోని 147, 150 సెక్షన్ ల కింద కేసు నమోదు చేసి ఉద్యమకారులను జైలుకు తరలించారు. రైల్వే సెక్షన్ ఇంజనీర్ రుక్మాంగద నాయుడు ఇచ్చిన ఫిర్యాదు పై అప్పటి వరంగల్ రైల్వే పోలీస్ ఇన్స్పెక్టర్ చైతన్య చందర్ వీరిపై కేసు నమోదు చేశారు. అప్పటి రైల్వే పోలీస్ డిఎస్పి దక్షిణామూర్తి కేసు దర్యాప్తు చేసి రైల్వే కోర్టులో చార్జ్ షీటు దాఖలు చేశారు. కాజీపేట లోని రైల్వే కోర్టులో ఈ కేసులో



ఉన్న ఉద్యమకారులు గుంటుక సోమయ్య, అంబటి శ్రీనివాస్, మాదాసు యాకయ్య, మాదాసు రవి, మాసం వెంకన్న, తాత సుధాకర్, సూరం రమేష్ రెడ్డి, మాదాసు రామ్మూర్తి , గాజుల కృష్ణ, ఆకుల ఉప్పలయ్య, సముద్రాల కనకయ్య, కోరుకొండ యాకయ్య, దంతాల రవి లు ఎనిమిది సంవత్సరాలపాటు విచారణ కు హాజరయ్యారు. అనంతరం ఈ కేసు హనుమకొండలోని ప్రిన్సిపల్ సబ్ కోర్టుకు బదిలీ కావడంతో అక్కడికి కూడా 8 సంవత్సరపాటు విచారణ ఎదుర్కొన్నారు,సాక్షాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి గుండు రామలింగం ఈ కేసులో బలమైన సాక్షాలతో నేరాన్ని రుజువు పర్చడలో రైల్వే పోలీసులు విఫలమయ్యారని భావిస్తూ 16 సంవత్సరాలు కొనసాగిన కేసును గురువారం రోజు కొట్టి వేశారు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగాలకు తెగించి ఉద్యమంలో పాల్గొని అనేకమైన కేసులో జైలు పాలై ఆర్థికంగా మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న వారందరిని తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తించి తగిన ప్రోత్సాహకాలు కల్పించాలని కోరుతున్నాము.

# చర్ల సీహెచ్‌సీలో ఆరు నెలల్లో 100 శస్త్రచికిత్సలు

**-స్థానిక గిరిజనులకు వరంగా మారిన ప్రభుత్వాసుపత్రి.**

ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిసర ప్రాంతాలకు వైద్య సేవల్లో కీలకమైన చర్ల ప్రభుత్వ ఆసుపత్రి గత ఆరు నెలల్లో 100 ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి మరో మైలురాయిని సాధించింది. గతంలో చర్ల ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో ట్యూబెక్టమీ వంటి శస్త్రచికిత్సల కోసం రోగులు 56 కి.మీ దూరంలోని ఏరియా ఆసుపత్రి భద్రాచలం వరకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో రోగులపై ఆర్థిక భారం, శారీరక ఇబ్బందులు అధికంగా ఉండేవి. ప్రస్తుతం సిజేరియన్ వంటి ప్రధాన శస్త్రచికిత్సలతో పాటు అత్యాధునిక టిఫా స్కానింగ్ సేవలు కూడా అందుబాటులోకి రావడం గమనార్హం. భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు సూచన మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ జితేశ్ పాటిల్ ప్రత్యేక దృష్టి సారించి ఆరు నెలల క్రితం చర్ల ఆసుపత్రిలో నూతన ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేసి అవసరమైన పరికరాలు సమకూర్చారు. అలాగే మాతృ సేవలకు అవసరమైన ప్రసూతి, పిల్లల, మత్తు వైద్య నిపుణులను నియమించారు. దీంతో స్థానికంగా అన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చి గిరిజన ప్రాంతాల ప్రజలకు పెద్ద ఊరట లభించింది. జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక దృష్టి. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ అంకిత్ చర్ల ఆసుపత్రిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇటీవలే ఒక రేడియాలజిస్ట్ వైద్య నిపుణురాలిని నియమించారు. అలాగే అత్యవసర సేవలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులు, ముగ్గురు శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. మరింత విస్తృత సేవల దిశగా కృషి



-- డీసీహెచ్ఎస్ డా. రవి బాబు. డీసీహెచ్ఎస్ డా. రవి బాబు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ నేతృత్వంలో భద్రాచలం శాసనసభ్యులు డా. తెల్లం వెంకట్రావు మద్దతుతో మరింత విస్తృత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 100 ట్యూబెక్టమీ శస్త్రచికిత్సల మైలురాయి సాధించినందుకు చర్ల ఆసుపత్రి వైద్య బృందం డా. కె. శ్రావణి, డా. కె. శివ రామకృష్ణ ప్రసాద్ ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని అభినందించారు. అవసరమైన మద్దతు అందించిన జిల్లా కలెక్టర్ అంకిత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఓపీ గదుల ఏర్పాటు, పరికరాల మంజూరు చేసిన ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపారు. చర్లలో నిర్మాణంలో ఉన్న 30 పడకల నూతన భవనం పూర్తయిన తర్వాత మరింత మెరుగైన వైద్య సేవలు అందించగలమని పేర్కొన్నారు. హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు చర్ల ఆసుపత్రిలో అందుతున్న సేవల పట్ల పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతి చిన్న అవసరానికీ భద్రాచలం వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ అవసరం లేకపోవడం సంతోషకరమని తెలిపారు. ముఖ్యంగా గర్భిణి మహిళలకు చర్ల ఆసుపత్రి ఎంతో అనుకూలంగా మారిందని, దీంతో ఆర్థిక భారం మాత్రమే కాకుండా ప్రయాణ ఇబ్బందులు కూడా గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు.

# కొదురుపాక గ్రామంలో బాలల భద్రత

# డ్రగ్స్ రహిత తెలంగాణపై అవగాహన శిబిరం





ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, బాలల భద్రత మరియు డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా గురువారం కొదురుపాక గ్రామంలో అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, నిర్లక్ష్యానికి గురైన వారు, కుటుంబ మద్దతు లేని బాలల పరిస్థితులపై సమగ్ర వివరాలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో మొత్తం 302 మంది పిల్లలు ఈ కోవకు చెందిన వారిగా గుర్తించినట్లు జిల్లా సంక్షేమ అధికారి ఈ లక్ష్మీరాజం తెలిపారు. వీరందరికీ ప్రభుత్వం తరఫున విద్య, వైద్యం, వసతి వంటి మౌలిక సౌకర్యాలు అందించేందుకు మిషన్ వాత్సల్య విభాగం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పిల్లలకు అవసరమైన జనన ధృవీకరణ పత్రాలు, తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రాలు, కులం, ఆదాయం, బ్యాంక్ ఖాతా, ఆధార్ వంటి పత్రాలను అందించేందుకు జిల్లా కలెక్టర్ శ్రీమతి గరిమ అగ్రవాల్ ఐఏఎస్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దత్తత విషయంలో చట్టపరమైన విధానాలను తప్పనిసరిగా అనుసరించాలని, అక్రమంగా పిల్లల కొనుగోలు, అమ్మకాలు జరిపితే కఠిన శిక్షలు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. అలాగే పిల్లల సంరక్షణకు ముందుకు వచ్చే సంస్థలు ప్రభుత్వానికి వివరాలు అందించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పోస్టర్ కేర్ విధానంలో పిల్లలను తాత్కాలికంగా పెంచాలనుకునేవారు, లేదా సంస్థలకు విరాళాలు అందించాలనుకునే వారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీడీపీఓ సుచరిత, జిల్లా విమెన్ హబ్ కోఆర్డినేటర్ రోజా, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కవిత, లీగల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ అంజయ్య, సర్పంచ్ కత్తెరపాక మంజుల, ఎంపీడీవో జయశీల, తహసీల్దార్ షరీఫ్, మండల విద్యాధికారి, వైద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందుతున్న ఆఫీసర్ నూతాల సుజ్ఞాన్ కి ఆత్మీయ సన్మానం



ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

సింగరేణి సంస్థ పర్సనల్ డిపార్ట్మెంట్ లో సుమారు 38 సంవత్సరాలపాటు పని చేసి ప్రస్తుతము సింగరేణి ప్రధాన కార్యాలయ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నందు సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కమ్యూనికేషన్ ఆఫీసర్ గా పనిచేస్తూ గురువారం న పదవీ విరమణ పొందుతున్న నూతాల సుజ్ఞాన్ ని జీఎం(పర్సనల్) వెల్ఫేర్ ఆ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ వెల్ఫేర్, ఏఈపిఏటిటి సెల్, ఆర్సె, కమ్యూనికేషన్, స్పోర్ట్స్, సిపిఆర్ఎంఎస్ విభాగాల డిజిఎం(పర్సనల్) లు, డివై.పిఎం లు, సీనియర్ పిఓ లు ఇతర అధికారులు పర్సనల్ డిపార్టెంట్ల సిబ్బంది సింగరేణి ప్రధాన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు గురువారం గురువారమున పూల మాలలతో, శాలువాలతో జ్ఞాపికలతో ఘనముగా సన్మానించారు. సందర్భముగా వారు మాట్లాడుతూ గావిస్తున్న సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కమ్యూనికేషన్ ఆఫీసర్ నూతాల సుజ్ఞాన్ సింగరేణి సంస్థలో క్లర్క్ స్థాయి నుండి సీనియర్ పర్సనల్ ఆఫీసర్ గా 38 సంవత్సరాల సుధీర్ఘ సర్వీస్లో అంకిత భావం, క్రమశిక్షణ, సమయపాలన తో కష్టించి పనిచేశారని తెలుపుతూ వారి శేష జీవితం సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా గడపాలని అన్నారు. కార్యక్రమంలో జీఎం(పర్సనల్) వెల్ఫేర్ ఆ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, డిజిఎం(పర్సనల్) లు కేసా నారాయణ రావు, బి.శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, పి.వేణు గోపాల రావు, డివై.పిఎం లు కే.సునీల్ కుమార్, కే.శివ కుమార్, సీనియర్ పిఓ లు ఎం.శ్రీనివాస్, పి.కాంతారావు, పర్సనల్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

# కవిత పార్టీకి 'టీఆర్ఎస్' పేరు ఖరారు

## కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక ప్రకటన

**-జిల్లా నాయకుల్లో హర్షం**

ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా



మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం బిగ్ రిలీఫ్ ఇచ్చింది. ఆమె ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీకి "తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)" పేరును అధికారికంగా కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారులు బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి చేరుకుని పార్టీ పేరుకు అనుమతి మంజూరు చేసిన లేఖను అందజేశారు. ఈ పరిణామంతో పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ హైదరాబాద్ లోని తన నివాసం లో కవిత ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ జిల్లా నాయకుడు వీరప్పగారి రమేష్ గౌడ్ మాట్లాడుతూ, పార్టీకి అధికారిక గుర్తింపు లభించడం ఎంతో సంతోషకరమని అన్నారు. త్వరలో పార్టీ ఆధ్వర్యంలో పలు ప్రజా కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల సమస్యలపై ప్రతిపక్ష హోదాలో పోరాటం చేస్తామని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి ప్రతి సమస్యపై గళమెత్తి పోరాడేందుకు పార్టీ కట్టుబడి ఉందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే తమ లక్ష్యమని రమేష్ గౌడ్ పేర్కొన్నారు.

# పదవ తరగతి మండల టాపర్లను అభినందించిన ఎంఈఓ శోభారాణి



ఏప్రిల్ 30 హిందూస్థాన్ మీడియా

వీణవంక మండలంలోని పదవ తరగతిలో అత్యధిక మార్కులతో, అద్భుత విజయాన్ని సాధించిన చల్లూరు గ్రామంలోని ఆల్ఫ్రెడ్ నోబెల్ హైస్కూల్ విద్యార్థులను గురువారం మండల ఎంఈఓ శోభారాణి, పాఠశాల చైర్మన్ జాన్ థామస్, స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ లు పూల గుచ్ఛాలు అందజేస్తూ అభినందించారు.

# బిజినెస్

## సెన్సెక్స్, నిఫ్టీ పతనం.. మార్కెట్లను ముంచిన ముడిచమురు!



హిందుస్థాన్ మీడియా ఏప్రిల్ 30

అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు భగ్గుమనడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో సూచీలు పతనమయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 582.86 పాయింట్లు నష్టపోయి 76,913.50 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 180.10 పాయింట్లు క్షీణించి 23,997.55 వద్ద ముగిసింది. ఇరాన్ శాంతి ప్రతిపాదనను అమెరికా తిరస్కరించడం, కీలకమైన చమురు రవాణా మార్గం హార్మూజ్ జలసంధి వద్ద దిగ్బంధనాన్ని తీవ్రతరం చేయడంతో బ్రెంట్ క్రూడ్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుందనే ఆందోళనలను పెంచింది. ఫలితంగా ద్రవ్యోల్బణం భయాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఈ ప్రభావం తో ఐటీ, ఫార్మా వంటి డిఫెన్సివ్ రంగాలు మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టపోయాయి. ముఖ్యంగా నిఫ్టీ మెటల్, నిఫ్టీ కన్‌స్ట్రక్షన్ డ్యూరబుల్స్ సూచీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నిఫ్టీలో టాటా మోటార్స్, హిందాల్కో ఇండస్ట్రీస్ వంటివి టాప్ లూజర్లుగా నిలిచాయి. మరోవైపు, ముడిచమురు ధరలు 120 డాలర్ల సమీపానికి చేరడంతో రూపాయి విలువ కూడా పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.20 స్థాయికి బలహీన పడింది. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం నిఫ్టీకి 23,800 వద్ద కీలక మద్దతు లభించగా, 24,100-24,150 శ్రేణిలో తక్షణ నిరోధం ఎదురవుతోంది.

# ఈపీఎఫ్ చందాదారులకు డబుల్ గుడ్ న్యూస్..

## భారీగా పెరగనున్న పెన్షన్.. ఏటీఎం నుంచి డబ్బులు విత్ డ్రా!

హిందుస్థాన్ మీడియా ఏప్రిల్ 30

ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) చందాదారులకు త్వరలో కీలకమైన శుభవార్తలు అందనున్నాయి. ఉద్యోగుల కనీస పెన్షన్‌ను భారీగా పెంచడంతో పాటు ఏటీఎంల ద్వారా పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించడంపై ప్రభుత్వం, ఈపీఎఫ్ఓ దృష్టి సారించాయి. ఈ మార్పులు అమలైతే కోట్లాది మంది ఉద్యోగులు, కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.




### రూ.7,500కు కనీస పెన్షన్ పెంపు యోచన

ప్రస్తుతం ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్-95) కింద ఇస్తున్న కనీస పెన్షన్ రూ.1,000గా ఉంది. దీనిని ఏకంగా రూ.7,500కు పెంచాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. కార్మిక సంఘాల నుంచి వస్తున్న ఒత్తిడి, పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఇదే సమయంలో చందాదారుల ఖాతాలకు 8.25 శాతం వడ్డీ రేటును జమ చేసే ప్రతిపాదన ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది.

### ఏటీఎం విత్ డ్రాయల్స్.. రికార్డు స్థాయిలో క్లెయిమ్స్ సెటిల్‌మెంట్

చందాదారులకు మరింత ఊరటనిచ్చేలా, ఏటీఎంల ద్వారా నేరుగా పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేసుకునే సౌకర్యంపై ఈపీఎఫ్ఓ కసరత్తు చేస్తోంది. ఇది అమలైతే, అత్యవసర సమయాల్లో డబ్బు డ్రా చేసుకోవడం మరింత సులభం, వేగవంతం కానుంది. మరోవైపు క్లెయిమ్స్ పరిష్కారంలో ఈపీఎఫ్ఓ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 8.31 కోట్ల క్లెయిమ్స్‌ను పరిష్కరించింది. అంతకుముందు ఏడాది ఈ సంఖ్య 6.01 కోట్లుగా ఉంది. ఇందులో 5.51 కోట్లు అడ్వాన్స్ లేదా పాక్షిక విత్ డ్రాయల్ క్లెయిమ్స్ కావడం గమనార్హం. ఆటోమేషన్, డిజిటల్ ప్రక్రియల ద్వారా క్లెయిమ్స్ పరిష్కార వేగాన్ని ఈపీఎఫ్ఓ గణనీయంగా మెరుగుపరిచింది. సుమారు 71.11 శాతం అడ్వాన్స్ క్లెయిమ్స్‌ను కేవలం మూడు రోజుల్లోనే పరిష్కరించింది.

### 'ఈ-ప్రాప్తి' పోర్టల్‌తో కొత్త సౌకర్యం

ఇటీవల ఈపీఎఫ్ఓ 'ఈ-ప్రాప్తి' అనే కొత్త పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. దీని ద్వారా చందాదారులు తమ పాత, యాక్టివ్‌గా లేని పీఎఫ్ ఖాతాలను ఆధార్ ఆధారిత యాక్సెస్‌తో సులభంగా యాక్టివేట్ చేసుకోవచ్చు. యూఏఎన్‌తో లింక్ కాని పాత ఖాతాలు ఉన్నవారికి ఈ పోర్టల్ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ డిజిటల్ మార్పులతో ఈపీఎఫ్ఓ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా మారుతున్నాయి.

# గ్యాస్ సిలిండర్ నుంచి ఆన్‌లైన్ గేమింగ్ వరకు కొత్త రూల్స్!

హిందుస్థాన్ మీడియా ఏప్రిల్ 30

మే 1, శుక్రవారం నుంచి కొత్త నెల ప్రారంభం కాబోతోంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా సామాన్యుడి దైనందిన జీవితం, ఆర్థిక లావాదేవీలపై ప్రత్యక్ష ప్రభావం చూపే పలు కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. గ్యాస్ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డు చార్జీల వరకు, ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణల వరకు అనేక రంగాల్లో కొత్త నిబంధనలు అమలు కానున్నాయి. ఈ మార్పుల గురించి ముందుగా తెలుసుకోవడం బెటర్.




### గ్యాస్ బుకింగ్ లో కూడా కొత్త నిబంధనలు

ఇక పై గ్యాస్ బుకింగ్ విషయంలో కూడా కొత్త నిబంధనలు రానున్నాయి. ఒకసారి సిలిండర్ బుక్ చేశాక, మళ్లీ బుక్ చేయడానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల నిరీక్షణ కాలాన్ని తప్పనిసరి చేసే అవకాశం ఉంది. దీంతోపాటు డెలివరీ ప్రక్రియలో భద్రతను పెంచేందుకు డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) విధానాన్ని తప్పనిసరి చేస్తున్నారు. ఇకపై సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారుడు తమ ఫోన్‌కు వచ్చిన ఓటీపీని డెలివరీ ఏజెంట్‌కు చెప్పాల్సి ఉంటుంది. అలాగే, ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) లబ్ధిదారులు సబ్సిడీ ప్రయోజనాలు కొనసాగాలంటే, ఆధార్ ఆధారిత ఈ-కేవైసీని తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలి. లేనిపక్షంలో సబ్సిడీ నిలిచిపోయే ప్రమాదం ఉంది.

---

# ఐపీఎల్‌లో భారీగా పరుగులు... ఇది వ్యాపారమన్న ముత్తయ్య మురళీధరన్

హిందుస్థాన్ మీడియా ఏప్రిల్ 30



ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో ఆయా జట్లు 200 పరుగులు సులభంగా నమోదు చేస్తున్నాయి. ఈ స్కోర్లను తదుపరి బ్యాటింగ్ చేసిన జట్లు కూడా ఛేదిస్తున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 30సార్లకు పైగా రెండొందల స్కోర్లు నమోదయ్యాయి. ప్రత్యర్థి జట్లు 265, 244 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన సందర్భాలు ఉన్నాయి. దీనితో బౌలర్లపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వస్తున్నాయి. భారీ పరుగులు రావడంపై సన్ రైజర్స్ హైదరాబాద్ స్పిన్ బౌలింగ్ కోచ్ ముత్తయ్య మురళీధరన్ స్పందించాడు. ఐపీఎల్ క్రికెట్ వ్యాపారమని స్పష్టం చేశాడు. స్పాన్సర్లు, ప్యాయర్ షిప్ అవసరమని అభిప్రాయపడ్డాడు. అయితే పరుగులు రావడానికి పిచ్ ప్రధాన కారణమని అన్నాడు. టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ వేగంగా పరుగులు రాబడుతున్నారని, ఈ పిచ్‌లు బౌలర్లకు అంతగా సహకరించడం లేదని అన్నాడు. వీటికి తోడు బౌండరీ సైజ్‌లు కూడా చిన్నగా ఉండటం వల్ల బౌలర్లకు కష్టంగా మారిందని తెలిపాడు. బౌలింగ్‌కు సహకరించేలా పిచ్‌ను రెడీ చేస్తే ప్రేక్షకులు బోర్ కొడుతుందని చెప్పే ప్రమాదం ఉందని అన్నారు. ఐపీఎల్ స్ట్రక్చర్ కూడా అలాగే ఉందని పేర్కొన్నాడు. భారీ మొత్తంలో పరుగులు రావడానికి బౌలర్లను తప్పుపట్టాల్సిన అవసరం లేదని తెలిపాడు. 2020 నుంచి మ్యాచ్‌లు చూస్తున్నవారు ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఎక్కువగా ఆశిస్తారని పేర్కొన్నాడు. మ్యాచ్ సమయంలో ఫోర్లు, సిక్సులు ఉండాలని కోరుకుంటారని అన్నాడు. అలాంటి వారి కోసమే ఐపీఎల్‌లో చాలా మార్పులు చేసినట్లు చెప్పాడు. ఇంపాక్ట్ రూల్‌తో అదనంగా బ్యాటర్ రావడం వల్ల స్కోర్ బోర్డుపై కనీసం 200 మార్క్ కనిపిస్తోందని తెలిపాడు. ఈ మెగా లీగ్ ఆవిర్భావం వెనుక చాలా అంశాలు ఉంటాయని అన్నాడు. క్రికెట్‌ను అభివృద్ధి చేస్తున్నారా లేదా అనేది ఇక్కడ విషయం కాదని అన్నాడు. క్రికెటర్లకు అవకాశాలు వస్తున్నాయని, అలాగే, అభిమానులకు ఎంటర్‌టైన్‌మెంట్ దొరుకుతుందని అన్నాడు. ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ పెద్ద వ్యాపారమని అంగీకరించాడు. ఇక్కడ స్పాన్సర్లే కీలకమని తెలిపాడు. మ్యాచ్‌లో విసుగు తెప్పిస్తే ప్రజలు చూడరని, అప్పుడు స్పాన్సర్లను, ప్యాయర్ షిప్‌ను కోల్పోవాల్సి ఉంటుందని స్పష్టం చేశాడు.

# ఐపీఎల్ చరిత్రలోనే శార్దూల్ లాంటి ఇంపాక్ట్ ప్లేయరే లేడు

హిందుస్థాన్ మీడియా ఏప్రిల్ 30



ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ ఓటముల పరంపర కొనసాగుతోంది. సొంత మైదానం వాంఖడే స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓడిపోయి, ఈ సీజన్‌లో ఆరో ఓటమిని నమోదు చేసింది. అయితే, ఈ ఓటమి కంటే ఎక్కువగా ముంబై జట్టు తీసుకున్న ఓ విచిత్ర నిర్ణయంపైనే ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చిన శార్దూల్ ఠాకూర్ బ్యాటింగ్ లేదా బౌలింగ్ చేయకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

### ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చి బ్యాటింగ్, బౌలింగ్ చేయని శార్దూల్!

మ్యాచ్ ముగిసిన తర్వాత "ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన శార్దూల్ ఠాకూర్‌తో బ్యాటింగ్ గానీ, బౌలింగ్ గానీ ఎందుకు చేయించలేదు?" అనే ప్రశ్న 'ఎక్స్' (ట్విట్టర్)లో వైరల్‌గా మారింది. ఐపీఎల్ చరిత్రలోనే బహుశా ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చి బ్యాటింగ్, బౌలింగ్ చేయని మొదటి ఆటగాడు శార్దూల్ కావచ్చని విశ్లేషకులు, అభిమానులు చర్చిస్తున్నారు. ముంబై యాజమాన్యం అనుసరించిన ఈ వింత వ్యూహం పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు శార్దూల్‌ను జట్టులోకి తీసుకురావడం వెనుక వ్యూహం ఏంటో అంతుచిక్కక అభిమానులు తలలు పట్టుకుంటున్నారు.

# స్పోర్ట్స్

## డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్.. రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్‌కు భారీ జరిమానా



హిందుస్థాన్ మీడియా ఏప్రిల్ 30

రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ పై బీసీసీఐ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ (ఈ-సిగరెట్ త్రాగడం) చేస్తూ కెమెరాకు చిక్కడంతో అతని మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించింది. దీంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా కేటాయించింది. ఆటకు అప్రతిష్ఠ తెచ్చే ప్రవర్తన కింద ఈ చర్యలు తీసుకున్నట్లు బీసీసీఐ స్పష్టం చేసింది. పంజాబ్ కింగ్స్‌తో ముల్లన్‌పూర్‌లో మంగళవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ ఛేజింగ్ చేస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. లైవ్ ప్రసారంలో పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. వాస్తవానికి ఫీల్డ్ అంపైర్లు తన్మయ్ శ్రీవాస్తవ, నితిన్ మీనన్ ఈ విషయాన్ని వెంటనే మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మ దృష్టికి తీసుకెళ్లలేదు. అయితే, టీవీ ఫుటేజీని చూసిన తర్వాత వారు రిఫరీకి ఫిర్యాదు చేశారు. విచారణలో పరాగ్ తన తప్పును అంగీకరించి, విధించిన శిక్షను అంగీకరించడంతో తదుపరి విచారణ అవసరం లేకుండా పోయింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.21 ప్రకారం రియాన్ పరాగ్ నిబంధనలను ఉల్లంఘించినట్టు బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆటకు అప్రతిష్ఠ కలిగించే ఏ ప్రవర్తన అయినా ఈ నిబంధన కిందకు వస్తుందని తెలిపింది. ఇది లెవల్ 1 తప్పిదం కావడంతో ఫీజులో కోత, డీమెరిట్ పాయింట్‌తో సరిపెట్టారు. ఐపీఎల్ ప్రతిష్ఠను కాపాడేందుకు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఆటగాళ్లు, జట్లు, యాజమాన్యాలపై మరింత కఠినమైన చర్యలు తీసుకునే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు బీసీసీఐ హెచ్చరించింది.

## సినిమాల్లోకి మంజుల మనవరాలు.. 'అగధ'తో ఎంట్రీ

హిందుస్థాన్ మీడియా ఏప్రిల్ 30




ఒకప్పటి ప్రముఖ కథానాయిక మంజుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ఆమె మనవరాలు జోవికా విజయ్ కుమార్ వెండితెర అరంగేట్రం చేస్తున్నారు. ప్రముఖ దర్శకుడు ఎం.ఎస్. రాజు రూపొందిస్తున్న 'అగధ' చిత్రంతో ఆమె నటిగా పరిచయమవుతున్నారు. ఆసక్తికరంగా, జోవికా తల్లి వనిత విజయ్ కుమార్ ను కూడా 'దేవి' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం చేసింది ఎం.ఎస్. రాజే కావడం విశేషం. ఈ సందర్భంగా 'అగధ' చిత్రంలో జోవికా పోషిస్తున్న 'హరిణి' పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. వర్షం కురుస్తున్న పురాతన నేపథ్యంలో, ఆమె కళ్లలో తీక్షణత, అంతర్లీనంగా ఉన్న శక్తిని ప్రదర్శిస్తూ పోస్టర్‌లో ఆకట్టుకున్నారు. ఈ పాత్ర కథలోని ఆధ్యాత్మిక, రహస్య అంశాలతో ముడిపడి ఉంటుందని తెలుస్తోంది. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. 85 రోజుల చిత్రీకరణ, భారీ సెట్లు, దాదాపు 45 నిమిషాల వీఎఫ్ఎక్స్‌తో 'అగధ' ప్రేక్షకులకు ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

## రూ.30,000 కోట్ల ఆస్తి వివాదం.. కరిష్మా కపూర్ పిల్లలకు ఊరట!

- రూ.30,000 కోట్ల ఆస్తి కోసం సంజయ్ కపూర్ కుటుంబంలో తీవ్ర వివాదం
- ఆస్తులను అమ్మవద్దని సంజయ్ మూడో భార్యకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం
- మూడో భార్య సృష్టించిన వీలునామా నకిలీదని కరిష్మా కపూర్ పిల్లల ఆరోపణ
- ఖరీదైన గుర్రాలు, వాచీలు, పెయింటింగ్స్ జాబితాలో చేర్చలేదని ఫిర్యాదు


హిందుస్థాన్ మీడియా ఏప్రిల్ 30



నటి కరిష్మా కపూర్ మాజీ భర్త, ప్రముఖ వ్యాపారవేత్త, దివంగత సంజయ్ కపూర్‌కు చెందిన రూ.30,000 కోట్ల వారసత్వ ఆస్తి వివాదంలో ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సంజయ్ కపూర్ ఆస్తులను విక్రయించకుండా వాటిని పరిరక్షించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఆయన మూడో భార్య ప్రియా సచ్‌దేవ్ కపూర్‌ను ఆస్తులు అమ్మకుండా, బ్యాంకు ఖాతాలను నిర్వహించకుండా నిలువరిస్తూ ఇంజంక్షన్ ఆర్డర్ మంజూరు చేసింది. సంజయ్ కపూర్‌కు ఆయన రెండో భార్య కరిష్మా కపూర్ ద్వారా కలిగిన సంతానం కియాన్, సమైరాలు ఈ కేసును దాఖలు చేశారు. తమ తండ్రి మరణానంతరం ఆయన మూడో భార్య ప్రియా సచ్‌దేవ్ ఒక నకిలీ వీలునామాను సృష్టించారని వారు ఆరోపించారు. అంతేగాక కోర్టుకు సమర్పించిన ఆస్తుల జాబితా అసంపూర్ణంగా ఉందని, పోలో క్రీడకు ఉపయోగించే ఖరీదైన గుర్రాలు, రోలెక్స్ వంటి విలాసవంతమైన వాచీలను అందులో చేర్చలేదని తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. కపూర్ కుటుంబానికి చెందిన అనేక స్థిరాస్తులు, అత్యంత విలువైన పెయింటింగ్స్‌ను కూడా ప్రియా కపూర్ దాఖలు చేసిన జాబితాలో చూపలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, వీలునామాపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రియా కపూర్‌పైనే ఉందని స్పష్టం చేసింది. ఒకవేళ భవిష్యత్తులో వీలునామా నకిలీదని తేలితే, అప్పటికే ఆస్తులు చేజారిపోతే వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని కోర్టు అభిప్రాయపడింది. అందుకే ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. గతేడాది జూన్‌లో 53 ఏళ్ల సంజయ్ కపూర్ లండన్‌లో పోలో ఆడుతూ మరణించారు. ఆయన మరణం గుండెపోటు వల్లే జరిగిందని తొలుత భావించినా, దీని వెనుక అంతర్జాతీయ కుట్ర జరిగి ఉండొచ్చని ఆయన తల్లి రాణి కపూర్ అనుమానం వ్యక్తం చేశారు. అయితే, బ్రిటన్ వైద్య అధికారులు మాత్రం అది సహజ మరణమేనని, గుండె సంబంధిత సమస్యలతోనే ఆయన చనిపోయారని ఆగస్టులో ధృవీకరించారు. ఈ వారసత్వ వివాదంలో ప్రియా కపూర్‌కు, సంజయ్ కపూర్ తల్లి రాణి కపూర్, సోదరి మందిరా కపూర్‌తో కూడా విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# రామ్ చరణ్ 'పెద్ది' లుక్ వెనుక రహస్యం ఇదే.. 16 నెలల కష్టం

హిందుస్థాన్ మీడియా ఏప్రిల్ 30




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తన రాబోయే చిత్రం 'పెద్ది' కోసం అసాధారణ రీతిలో సిద్ధమవుతున్నారు. క్రియేటివ్ డైరెక్టర్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం చరణ్ శారీరకంగా ఎంతగానో శ్రమిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన ఒకే పాత్ర కోసం ఏకంగా మూడు విభిన్నమైన రూపాల్లో కనిపించనుండటం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా జూన్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. గత 16 నెలలుగా రామ్ చరణ్‌కు శిక్షణ ఇస్తున్న ప్రముఖ సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ రక్శేష్ ఉద్దియార్, చరణ్ మేకోవర్ వెనుక ఉన్న కష్టం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. "'పెద్ది'లో ప్రధాన పాత్ర ఎలా ఉండాలనే దానిపై దర్శకుడు బుచ్చిబాబు, రామ్ చరణ్ చాలా స్పష్టంగా ఉన్నారు. ఆ పాత్రధారి 'గ్రీక్ గాడ్' లాంటి సిక్స్ ప్యాక్ బాడీతో కాకుండా, ఒక అచ్చమైన 'దేశీ పహిల్వాన్'లా సహజంగా కనిపించాలని చెప్పారు" అని వివరించారు.

### గదతో శిక్షణ.. సూర్య నమస్కారాలు

ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి రక్శేష్ ఒక పక్కా ప్రణాళికను రూపొందించారు. వారంలో శిక్షణను రెండు రకాలుగా విభజించారు. "సోమ, బుధ, శుక్రవారాల్లో ఫాస్టింగ్ కార్డియోతో పాటు వెయిట్ ట్రైనింగ్ ఉండేది. మంగళ, గురు, శనివారాల్లో ఫంక్షనల్ మూవ్‌మెంట్, కుస్తీ వ్యాయామాలు, మొబిలిటీ ఎక్సర్‌సైజ్‌లు చేయించాము" అని తెలిపారు. అంతేగాక గదతో శిక్షణ, సూర్య నమస్కారాలు, తాడు లాగడం, అఖాడా తరహా డ్రిల్స్ వంటి సంప్రదాయ పద్ధతులను కూడా అనుసరించినట్లు ఆయన పేర్కొన్నారు.

### ఆహారం విషయంలో సవాళ్లు

ఆహారం విషయంలో చాలా సవాళ్లు ఎదురయ్యాయని రక్శేష్ తెలిపారు. "చరణ్ అప్పటికే 50 నుంచి 60 శాతం శాకాహారం తీసుకుంటున్నారు. కానీ, శిక్షణ సమయంలో ఆయన్ను పూర్తి శాకాహారిగా మార్చడం చాలా కష్టమైంది. మేం 'కార్బ్ సైక్లింగ్' అనే పద్ధతిని అనుసరించి రోజుకు 1,800 నుంచి 2,500 క్యాలరీల డైట్ ప్లాన్ ఇచ్చాం. కొన్ని రోజులు తక్కువ కార్బ్స్, కొన్ని రోజులు ఎక్కువ కార్బ్స్ ఉండేలా చూసుకున్నాం" అని డైట్ ప్లాన్ గురించి వివరించారు. సినిమా ప్రారంభంలో పాత్ర ఒక సాధారణ పల్లెటూరి యువకుడిగా, సన్నగా కనిపించాల్సి ఉంటుంది. దీనికోసం చరణ్‌ను దాదాపు నాలుగు నుంచి ఐదు నెలల పాటు క్యాలరీ డెఫిసిట్ డైట్‌లో ఉంచి బరువు తగ్గించినట్లు ట్రైనర్ వెల్లడించారు. క్రమశిక్షణ విషయంలో చరణ్ అంకితభావం అద్భుతమని, ఉదయం 4 గంటలకే తనకు కాల్ వచ్చేదని రక్శేష్ గుర్తుచేసుకున్నారు. షూటింగ్‌కు ముందే శిక్షణ పూర్తిచేసి, సెట్‌కు వెళ్లే దారిలో కారులోనే మొదటి మీల్ తీసుకునేవారని తెలిపారు. ఈ మొత్తం ప్రయాణంలో సమన్వయం కోసం చెఫ్, డాక్టర్, డైటీషియన్, బాడీగార్డులు, వ్యక్తిగత సిబ్బందితో ఒక ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసినట్లు రక్శేష్ చెప్పారు. షూటింగ్ సమయంలో చరణ్ ఆరోగ్యం, ఆహారం విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఈ గ్రూప్‌లో నిరంతరం చర్చిస్తూ జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. "ఇది ఒక్క రోజులో పూర్తయ్యేది కాదు. చరణ్ శరీరాకృతి కోసం నేను దాదాపు ఒక ఏడాది నాలుగు నెలలు కేటాయించాను. ఆయన మూడో లుక్ అభిమానులకు కచ్చితంగా ఒక పెద్ద సర్‌ప్రైజ్ అవుతుంది" అని రక్శేష్ ఉద్దియార్ పేర్కొన్నారు.

## ఒక గంట నిద్రను కోల్పోతే.. కోలుకోవడానికి నాకు నాలుగు రోజులు పడుతుంది: త్రిష

హిందుస్థాన్ మీడియా ఏప్రిల్ 30



దక్షిణాది చిత్రసీమలో చెక్కుచెదరని అందంతో, తిరుగులేని క్రేజ్‌తో దూసుకుపోతున్న త్రిష ఇన్‌స్టాగ్రామ్ లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఎప్పుడూ గ్లామర్ ఫొటోలు, సినిమా అప్‌డేట్స్ ఇచ్చే త్రిష, ఈసారి తన వ్యక్తిగతమైన 'నిద్ర' గురించి చేసిన వింత లెక్క నెటిజన్లను అటు నవ్విస్తూనే, ఇటు ఆశ్చర్యానికి గురిచేస్తోంది. "ఒక గంట నిద్రను కోల్పోతే, దాని నుండి కోలుకోవడానికి నాకు నాలుగు రోజులు పడుతుంది. ఈ లెక్కన నేను మళ్ళీ ప్రశాంతంగా నిద్రపోవాలంటే 2062 వరకు ఆగాల్సిందేమో" అంటూ త్రిష చేసిన కామెంట్ వైరల్ అవుతోంది. ఆమె సరదాగా అన్నప్పటికీ, ప్రస్తుతం ఆమె షూటింగ్ షెడ్యూల్స్ ఎంత బిజీగా ఉన్నాయో, ఆమె ఎంతటి పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారో ఈ మాటలు ప్రతిబింబిస్తున్నాయి. త్రిష ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యుత్తమ దశలో ఉన్నారు. మెగాస్టార్ చిరంజీవితో భారీ సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర'తో పాటు, తమిళంలో సూర్యతో 'కరుప్పు' వంటి క్రేజీ ప్రాజెక్టులతో ఆమె డైరీ ఫుల్ అయిపోయింది. వరుస ప్రయాణాలు, రాత్రింబవళ్లు షూటింగులతో తీరిక లేకుండా గడపడం వల్లే ఆమెకు సరైన విశ్రాంతి దొరకడం లేదని స్పష్టమవుతోంది. సినిమాలతో పాటు తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లు, రాజకీయ అరంగేట్రంపై జరుగుతున్న ప్రచారం వంటివి కూడా ఆమెను కొంత ఒత్తిడికి గురిచేస్తుండవచ్చు. అందుకే తనకున్న మానసిక అలసటను ఇలా చమత్కారంగా సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

## మోదుగ ఆకుల గంపతో అనుపమ.. 'భోగి' నుంచి ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్!

హిందుస్థాన్ మీడియా ఏప్రిల్ 30



యంగ్ హీరో శర్వానంద్ కథానాయకుడిగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'భోగి'. ఈ చిత్రం నుంచి తాజాగా హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆమె 'కందుల సులోచన రాణి' అనే పవర్ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఈ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన పోస్టర్‌లో అనుపమ పూర్తి గ్రామీణ యువతి అవతారంలో కనిపించారు. కాళ్లకు చెప్పులు లేకుండా మట్టి దారిలో నడుస్తూ, తలపై మోదుగ ఆకులు నింపిన పెద్ద గంపను మోస్తున్నారు. మరో చేతిలో ఆకులు, టిఫిన్ బాక్స్ పట్టుకుని ఉన్నారు. పాతకాలపు లంగావోణి, ఆమె ముఖంలో కనిపిస్తున్న దృఢమైన భావాలు పాత్రలోని తీవ్రతను సూచిస్తున్నాయి. వెనుక మట్టి ఇళ్లు, పశువులతో కూడిన పల్లెటూరి వాతావరణం కనిపిస్తోంది. ఈ చిత్రంలో సులోచన రాణి ప్రకృతితో మమేకమై జీవించే, ఎంతో ధైర్యంగల యువతిగా కనిపించనుందని తెలుస్తోంది. మోదుగ ఆకులతో విస్తరాకులు తయారు చేస్తూ జీవనం సాగించే ఆమె పాత్రలో సహనం, బలం రెండూ ఉట్టిపడతాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా ఆయన 'గంగ' అనే పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే. 1960ల ప్రారంభంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఓ కల్పిత గ్రామంలో జరిగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా 'భోగి' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో డింపుల్ హయతి మరో కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం, రంపచోడవరం, మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణను చిత్రబృందం పూర్తి చేసింది. తదుపరి షెడ్యూల్ మే మొదటి వారం నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభం కానుంది.

Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455